# అమ్మవారి ఊరేగింపు.. నిమజ్జనం



మధుబన్‌కాలనీ విజయ కనకదుర్గా దేవాలయంలో దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు.

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 25: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకోని భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ నిమజ్జన ఊరేగింపులు ఘనంగా జరిగాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవాలయాలు, మండపాలలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహ నిమజ్జనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపు సందర్భంగా బతుకమ్మలను తీసుకొచ్చి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఊరేగింపులో నిర్వహించిన డీజే పాటలకు యువతీయువకులు పాల్గొని స్టెప్పులు వేశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి లడ్డూలు, చీరలను వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పోటీపడి అమ్మవారి చీరలు, లడ్డూలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పద్మశాలిపురంలో అమ్మవారి చీరను వేలం పాటలో రూ.40వేలకు దక్కించుకున్న భక్తుడు



మైలార్‌దేవ్‌పల్లిలో దుర్గామాత ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

**బీఆర్ఎస్ పిల్లోనిగూడ గ్రామ అధ్యక్షుడు జుర్కి రమేశ్**



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసిన పిల్లోనిగూడ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జుర్కి రమేశ్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 25: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను భారీ మెజార్టీతో నాలుగోసారి గెలిపిస్తామని బీఆర్ఎస్ పిల్లోనిగూడ గ్రామ అధ్యక్షుడు జుర్కి రమేశ్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ 2009 నుంచి వరుసగా జరిగిన ఎన్నికల్లో ఓటమి ఎరుగని నాయకుడిగా గెలుస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తూ ముందుకు సాగుతున్న ప్రకాశ్ గౌడ్‌ను నాలుగో సారి భారీ మోజార్టీతో గెలిపిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నట్లు వివరించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో జాతీయ స్థాయిలో తెలంగాణకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా, మిషన్‌కాకతీయతో చెరవులను పూడికతీత తీయడంతో తెలంగాణలో ఎక్కడ చూసిన నీటిలో చెరువులు నిండు కుండలా మారాయని వివరించారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతులు వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని వివరించారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా ప్రకాశ్ గౌడ్ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.

## అమ్మవారికి పూజలు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేసిన విప్, ఎమ్మెలే అరెకపూడి గాంధీ

– మాదాపూర్, అక్టోబర్ 25

## దుర్గం చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మాదాపూర్, అక్టోబర్ 25: తండ్రితో గొడవపడి తీవ్ర మనస్థాపం చెందిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసం ఉంటున్నసంపత్ కుమార్ (45) క్యాబ్ డ్రైవర్‌గా చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన తండ్రికి సంపత్ రావుకు మధ్యలో క్యాబ్ విషయమై గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపంతో ఈ నెల 25వ తేదీన ఉదయం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కంపెనీలో కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బంపదు తలెత్తి ఉండవచ్చున్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. సంపత్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు.

# రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతా..

- మరోసారి అవకాశమివ్వండి
- ఆత్మీయ సమావేశంలో అరెకపూడి గాంధీ



హుడా కాలనీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కాలనీవాసులతో విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, అక్టోబర్ 25: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ ఫేస్ 5తో పాటు హుడా కాలనీ లో స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా బుధవారం స్థానిక కాలనీ వాసులతో కలిసి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లిలో ఎనలేని అభివృద్ధి చేసి చూపడం జరిగిందని, మరో సారి ఆశీర్వదించి గెలిపించినట్లయితే రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతానని స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకువెళ్తానని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి నా వంతు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఇప్పటి వరకు రూ.9 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని, అందరి ఆశీస్సులతో, సహకారంతో రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు సాధనకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మహిళలు, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని అన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అధికారులు చక్కటి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని , ఎక్కడ పనులు ఆపకుండా ఎన్నో స్థల సేకరణ చేయాల్సి ఉన్నప్పటికి కూడా ప్రజల సహకారం తీసుకొని అధికారులను సమన్వయం పరుచుకుంటు ఇన్ని రోడ్లు అభివృద్ధి చేయడం బహుశా 50 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిదని చెప్పారు. శేరిలింగంపల్లిలో బ్రహ్మాండంగా ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రోడ్లు వేయడం జరిగిందని అన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు నాపై విశ్వాసంతో ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని కోరారు. అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మా పూర్తి స్థాయి మద్దతు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకేనని అన్నారు. ముచ్చటగా మూడోసారి అత్యధిక ముజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో తిరుగులేని మెజార్టీని ఇచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. భారీ మెజార్టీతో గులాభి జెండా ఎగురవేసి అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## 7.10 లక్షలకు చేరిన శేరిలింగంపల్లి ఓటర్లు

**నూతన ఓటు దరఖాస్తుకు ఈనెల31 వరకు గడువు**

మియాపూర్, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించగా..పోలింగ్ కేంద్రాలు, డీఆర్‌సీ, కౌంటింగ్ కేంద్రం, రాజకీయ పక్షాలతో సమావేశాలు తదితర ప్రక్రియలను నియోజకవర్గ ఎన్నికల అధికారులు చేపడుతున్నారు. ఈనెల మొదటి వారంలో ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను ప్రకటించిన విషయం విదితమే. దాని ప్రకారం నియోజకవర్గం 6,98,078 ఓటర్ల సంఖ్య ఖరారైంది. తుది ఓటర్ల జాబితాను ప్రకటించినప్పటికీ నవంబర్ 30 న ఎన్నికలు జరగనుండటంతో.. ఈ నెల చివరి వరకు కొత్త ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. తద్వారా ఇప్పటి వరకు నియోజకవర్గంలో 7,10,693 కు ఓటర్ల సంఖ్య చేరింది. ఇంకా 5600 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా రోజుకు నియోజకవర్గ వ్యాప్తంగా 500 వరకు నూతన ఓటు దరఖాస్తులు అందుతున్నాయి. ఈ నెల 31 వరకు నూతన ఓటు నమోదు నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. voters.eci.gov.in దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా.. నియోజకవర్గ ఓటర్ల సంఖ్య సుమారు 7.20 లక్షలకు చేరువలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.